# దొమ్మీ

## వేమూరి వెంకటేశ్వరరావు

సైరను ఊదుకుంటూ వచ్చి, కీచుమని శబ్దం చేస్తూ అంబులెన్సు ఆసుపత్రి ప్రాంగణంలో ఆగింది. అంబులెన్సులో ఉన్న పెరామెడిక్కులు ఎదురు సన్నాహం వచ్చిన నర్సుల సహాయంతో క్షతగాత్రి పడుక్కొని ఉన్న స్ట్రెచరుని బయటకి దింపి "ట్రామా, ట్రామా" అంటూ ఎమర్జెన్సీ గదిలోకి వచ్చారు.

ఇంగ్లీషులో "ట్రామా" అనే మాటకి "బలమయిన గాయాలు" అని తెలుగులో అర్థం చెప్పుకోవచ్చు. రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు, కత్తిపోట్లు, తుపాకి కాల్పులు, దొమ్మీలు వగయిరా సందర్భాలలో బలంగా తగిలిన దెబ్బలు ఒక రకం భౌతిక "ట్రామా." మనస్సుకి గట్టిగా తగిలిన దెబ్బ మానసిక "ట్రామా."

అమెరికాలో ఉన్న చాల ఆసుపత్రులలో ఎమర్జెన్సీ వార్డు అనే భాగం ఉంటుంది. కొన్ని కొన్ని ఆసుపత్రులలో క్షతగాత్రుల సంరక్షణకి ఎమర్జెన్సీ వార్డులోనే ట్రామా విభాగం అని ఉంటుంది. ప్రమాదంలో తగిలిన దెబ్బలకి శస్త్రచికిత్స అవసరం అయితే ఈ ట్రామా విభాగంలోకి తీసికెళతారు. లేకపోతే మెడికల్ విభాగం లోకి తీసికెళతారు.

క్షతగాత్రిని లోపలికి తీసుకుని రావడమేమిటి, ఎమర్జెన్సీ వార్డులో ఉన్న డాక్టర్లు, నర్సులు వెంటనే మనిషిని స్ట్రెచరు మీదనుండి బల్లమీదకి మార్చి చుట్టూ గుమిగూడడం ఏమిటి, అన్నీ నిమిషాలమీద జరిగి పోయాయి.

"ఏమిటి జరిగింది?" నేనడిగేను.

"సూపర్ మార్కెట్ దగ్గర చిన్న దొమ్మీ జరిగిందిటండి. అందులో ఈ పెద్దావిడ కాలు నిలదొక్కుకోలేక కింద పడిపోయిందిటండి. పడ్డ మనిషి మరి లేవలేదండి. కూతురు పక్కనే ఉందిటండి. జన సందోహం ఇలా పెద్ద కెరటంలా కొట్టుకొచ్చి ఈమె గారిని ఒక్క తోపు తోసేరుటండి. మనిషంటే కింద పడి పోయింది కాని చూడ్డానికి దెబ్బలేవీ కనబడడం లేదండి. కాని మనిషికి స్పృహ తప్పి అరగంట అవుతోందండి. ఉలుకు లేదు, పలుకు లేదు, అలా మానులా పడుందండి......."

"ఇది స్ట్రోకు. దీనికి సర్జరీ అనవసరం. మెడికల్ వార్డు లోకి తీసికెళ్లండి" పక్కింటి పిన్ని గారి కంటె ఒక వాసి ఎక్కువ వెడల్పుగా ఉన్న నల్ల నర్సు విల్మా తీర్మానించింది. మనిషి ఆకారం చూడగానే పెత్తనం చేసే పెద్దనర్సు అని ఎవరేనా అనుకుంటారు. కాని నిజానికి ఈ విమలమ్మ పెద్ద నర్సు కింద పనిచేసే చిన్న నర్సు. అసలు పేరు విల్మా కాని నేను మాత్రం విమలమ్మ అని తెలుగు పేరు పెట్టేసి పిలిచే వాడిని. ఏం మన దేశంలో పేర్లన్నీ ఇంగ్లీషువాళ్లు వాళ్లిష్టం వచ్చినట్లు మార్చెయ్యొచ్చు కాని మనమే నేమిటి తక్కువ తిన్నాం?

"ఆ మరీ చెప్పొచ్చావు. సరిగ్గా దొమ్మీ జరిగే వేళకే ఈవిడకి వాతం కమ్మిందంటావా" అని అంబులెన్సుని తోలుకొచ్చిన ఆసామీ విమలమ్మతో లడాయి వేసుకున్నాడు. అమెరికాలో అంబులెన్సు డ్రైవరుకి కూడా ప్రథమ చికిత్సలో తర్ఫీదు ఉంటుంది. అందుకని తనకి తెలుసున్న విషయం తన చెప్పేడు.

స్ట్రోకు ప్రమాదకరమయిన పరిస్థితి. దీని పర్యవసానంగ పక్షవాతం రావచ్చు. వెంటనే చికిత్స జరగక పోతే కాలో, చెయ్యో కదలకుండా పడిపోవచ్చు, మాట పడిపోవచ్చు, లేక శరీరం అంతా తోటకూర కాడలా వేలాడి పోవచ్చు, లేదా ప్రాణ పోవచ్చు. కనుక ఇక్కడ నర్సులూ డ్రైవర్లు తగువులాడుకుంటూ ఉంటే ఎటూ తేల్చకుండా ఊరుకుందికి ఇది అయిక్య రాజ్య సమితి ఏమీ కాదు. అందుకని నేనే మధ్యలో జోక్యం కలుగ జేసుకొని అన్నాను.

"చాల్చాలు. ఇక్కడ హయాంలో ఉన్న వైద్యుణ్ణి నేను. మెడికల్ కేసో, సర్జికల్ కేసో నేను తేలుస్తాను. ఈ వేళ ట్రామా భాగంలో కేసులు ఎక్కువగా లేవు. ట్రామా గది లోకే తీసికెళ్లండి."
అని ఉత్తర్వు జారీ చేసి, పక్కింటి పిన్ని గారి కంటె పదంగుళాలు ఎక్కువ వెడల్పుగా ఉన్న నరసమ్మ విమలమ్మ వేపు తిరిగి సముదాయింపుగా అన్నాను,

"ప్రస్తుతానికి ట్రామా అనుకున్నంత మాత్రాన వచ్చిన నష్టం ఏమీ లేదుగా. పేషంటు రికార్డుని పూర్తి చెయ్యండి ముందు. జీవలక్షణాలు, టెంపరేచరు, బీపీ, నాడి, శ్వాస కొలచి నమోదు చెయ్యడం, లేబులో పరీక్షకిగాను, రక్తం మచ్చు తీయడం, వగయిరా తంతు కానివ్వండి. మధ్యంతరంగా పరీక్ష ఆపేసిన ఆ చంటాడి చెవి పోటుకి కారణం ఏమిటో తేల్చుకుని నేనిప్పుడే వస్తాను"
అని సగం సగం చూస్తూ మధ్యలో ఆపేసిన రోగిని చూడ్డానికి వెనక్కి వెళ్లేను. తిరపతిలో మంగలాడి క్షవరం మాట నాకు తెలీదు కానీ మా ఎమర్జెన్సీ వార్డులో చేతులు తక్కువయినప్పుడు మేము కేసు నుండి కేసుకి గెంతుతూ ఉంటే ఆ సామెతే గుర్తు కొస్తుంది.

వెనక్కి తిరిగొచ్చేసరికి నర్సులు పేషెంటుని చకచకా తయారు చేస్తున్నారు. పేషెంటు చైనా దేశం మనిషి. కూతురే తల్లి తరఫున అడిగిన ప్రశ్నలకి సమాధానాలు చెబుతోంది. తల్లి పేరు చెంగు. మధ్య మధ్యలో తల్లి చెవిలో ఏదో చైనా భాషలో చెబుతోంది. కాని తల్లి ముఖ కళవళికలో లేశం అంత మార్పు లేదు. నిశ్చలంగా, నిశ్చింతగా నిద్ర పోతూన్నట్లు ఉన్న ఆ మని బతికుందో లేదో కూడా ఆ ఆడ కూతురుకి తెలీదు.

పేషెంటుని ఎగా దిగా మరొక సారి చూసిన తర్వాత విమలమ్మ చెప్పిన స్ట్రోకు సిద్ధాంతమే నిజమేమోనని అనిపించింది. ఈ నర్సులని అంత తేలికగా తీసి పారెయ్యడానికి వీల్లేదు. వైద్యులకి పుస్తకం గురువయితే ఈ నర్సులకి అనుభవం గురువు. పైకి ఏమీ అనక పోయినా మనస్సులోనే ఒక సారి స్ట్రోకు అంటే ఏమిటో మననం చేసికున్నాను.

మెదడులోకి రక్తం తీసికెళ్లే నాళాలు ప్రమాద వశాత్తూ పగిలినా, లేదా నాళంలో ప్రవాహానికి ఏదయినా అడ్డంకి వచ్చినా, మెదడుకి కావలసిన మోతాదులో రక్తం అందదు. ఈ సందర్భంలో మెదడుకి కలిగే అపాయమే స్ట్రోకు అంటే. ఈ స్ట్రోకులలో రకరకాలు ఉన్నాయి. పిత్తఘృతాల్ (దీనినే ఇంగ్లీషులో కొలెస్టెరాల్ అంటారు) వంటి పదార్థాలు రక్తనాళం లోపలి గోడలలో చేరినప్పుడు నాళం సన్నబడి ప్రవాహం ఆగిపోతే దానిని "థ్రాంబోసిస్" అంటారు. నాళం పగిలి రక్తం మెదడులోకి చిమ్ముకు పోతే దాన్ని "సెరిబ్రల్ హెమరేజి" అని కాని ఉత్తినే "హెమరేజి" అని కాని అంటారు. రెండూ ప్రమాదకరమయిన పరిస్థితులే కాని గుడ్డిలో మెల్లలా రెండింటిలోనూ థ్రాంబోసిస్ మెరుగు. ఎందుకంటే థ్రాంబోసిస్ వల్ల స్పృహ తప్పిపోవడం సామాన్యంగా జరగదు. ఈ రెండింటికి మధ్యనున్న తేడా తెలియాలంటే కొంచెం శరీర నిర్మాణశాస్త్రం తెలియాలి.

బల్లమీద ఉన్న మన చెంగమ్మగారు చాల లోతైన నిద్రలో ఉన్నారు. ఇలాంటి నిద్రని ఇంగ్లీషులో "కోమా" అంటారు. గ్రీకు భాషలో కోమా అంటే ఘాటయిన నిద్ర అని అర్థం. ఆ రకం నిద్రలో ఉన్న వారికి పక్కన బాంబు వేసినా మెలుకువ రాదు. సూదితో గుచ్చినా మెలుకువ రాదు. జ్ఞానేంద్రియాలకి మూతలు పడిపోయాయన్న మాట.

అసలు కపాలంలో బంధించబడి ఉన్న మెదడుకి మన జ్ఞానేంద్రియాలు కిటికీల లాంటివి. చుట్టూ జరుగుతూన్న విషయాలని సేకరించి, వాటిని విద్యుత్ వాకేతాలుగా మార్చి ముడతలు పడ్డ పెద్ద మెదడుకి పంపుతాయి. ఈ పెద్ద మెదడునే ఇంగ్లీషులో "సెరెబ్రమ్" అంటారు. ఈ పెద్ద మెదడే మన స్మృతి స్థానం. ఆలోచనా పీఠం. అనుభూతుల స్థావరం. ఈ పెద్ద మెదడే శరీరం ఎప్పుడెప్పుడు ఏమేమి చెయ్యాలో ఆదేశిస్తుంది. ఈ ఆదేశాలని చిన్న మెదడు ఆచరణలో పెడుతుంది. చిన్న మెదడుని "సెరిబెల్లమ్" అంటారు. ఈ చిన్న మెదడుని ఆనుకుని మేధాకాండం తోకలా కిందికి దిగి వెన్నుపాముగా మారుతుంది. ఈ వెన్నుపాము నుండే నరాలు శరీరం అంతా వ్యాపించి మెదడు దగ్గర బయలు దేరిన వార్తలని కండరాల వరకు మోసుకుని వెళతాయి.

పెద్ద మెదడు చూడడానికి రెండు సీతాఫలాలని అతికించినట్లు ఉంటుంది. స్ట్రోకు అనేది సర్వసాధారణంగా పెద్ద మెదడులోని కుడి అర్థభాగంలో కాని ఎడమ అర్థభాగంలో కాని వస్తుంది. శరీరం కుడి భాగం ఎడమ మెదడు అధీనంలోనూ, ఎడమ భాగం కుడి మెదడు అధీనంలోనూ ఉంటాయి కనుక, స్ట్రోకు వచ్చినప్పుడు శరీరంలో ఏదో ఒక భాగమే దెబ్బతింటుంది కనుక పక్షవాతం రావచ్చు, కాని స్పృహ పూర్తిగా పోదు.

ఈ రెండు భాగాలు కలుసుకున్న చోట ముచ్చికలాంటి కట్టడం ఒకటుంది. చేపలు, పురుగులు మొదలయిన అల్పజీవులలో మెదడంటే ఈ ముచ్చిక మాత్రమే ఉంటుంది, అర్థభాగాలుండవు. ఈ ముచ్చికని ఇంగ్లీషులో "బ్రెయిన్ స్టెమ్" అంటారు. మనం మేధాకాండం అందాం. ఈ మేధాకాండం వెళ్లి అర్థభాగాలని అతుక్కునే దమ్మిడీ అంత మేరని ఇంగ్లీషులో రెటిక్యులార్ ఏక్టివేటింగ్ సిస్టమ్ అంటారు. టూకీగా ఆర్యేయస్ అంటారు. ఇది మెదడులో ఒక మీట లాంటిది. మెయిన్ స్విచ్చి లాంటిదన్న మాట. ఇది దెబ్బ తింటే దీపం ఆరి పోయినట్లే. అప్పుడు స్పృహ పూర్తిగా పోతుంది. ఈ మీట సుమారుగా మన కండ్ల వెనకాతల ఉంది. కనుక ఈ మెదడులో జరిగిన రక్తస్రావం వల్ల ఈ మీట దెబ్బ తింటే వెంటనే ఆ విషయం కండ్లు పరీక్ష చేసి తెలుసుకోవచ్చు.

ఈ సందర్భంలో నా చిన్నప్పుడు మా ఊళ్లో జరిగిన ఒక సంఘటన నాకిప్పటికీ కళ్లకి కట్టినట్లు జ్ఞాపకం వస్తోంది. మా పెరటి వీధిలో ఉన్న చొక్కాకుల వారి తాతకి బాగా సుస్తీ చేసింది. అందరూ పెదవి విరిచేసేరు. మనిషిని మంచం మీంచి కిందకి దించేసేరు. అంతా లబో దిబో మన్నారు. శ్మశానానికి తీసికెళ్లడానికి పాడె కట్టే ప్రయత్నంలో ఉన్నారు. ఈ లోగా మా ఊళ్లో కొత్తగా ప్రేక్టీసు మొదలు పెట్టిన చల్లా సుబ్బారాయుడు గారు రిక్షాలో అటు వెళ్లడం చూసి ఎవరో రిక్షాని ఆపు చేసి తాత దగ్గరకి తీసుకొచ్చారు. డాక్టరుగారు తాత కను రెప్పలు చేత్తో వెనక్కి లాగి, కంట్లోకి టార్చి లైటు వేసి పరీక్ష చేసి, తల పంకించి, తాతకి ఏదో ఇంజక్షన్ ఇచ్చి పక్కన పది నిమిషాలు కూర్చున్నారు. నిద్దట్లోంచి లేచినట్లు చొక్కాకుల తాత లేచి కబుర్లు చెప్పడం మొదలు పెట్టేడు. తర్వాత సుబ్బారాయుడు గారి హస్తవాసికి తిరుగు లేదు. అయిదు దశాబ్దాల పాటు ఏకచ్ఛత్రాధిపత్యంగా తుని పురజనుల ఆదరాభిమానాలని చూరగొన్నారు.

వెంటనే చెంగమ్మ కండ్లు పరీక్ష చేసి ప్రతివర్తితలు ఎలా ఉన్నాయో గమనించేను. ఏమీ కదలిక కనిపించ లేదు. మెదడులో ఉన్న దమ్మిడీ సైజు రెటిక్యులార్ ఏక్టివేటింగ్ సిస్టమ్ దెబ్బ తినుండక పోతే చెంగమ్మ గారి పరిస్థితి ఇంత అన్యాయంగా ఉండదని మనస్సులో ఒక అనుమానం పీడిస్తోంది. మరొక్క పరీక్ష చెయ్యాలి. అందుకని కుడిచేతి బొటన వేలుతోటీ, చూపుడు వేలు తోటీ చెంగమ్మ కను రెప్పలని విడదీసి, ఎడం చేత్తో ఆవిడ బుర్రని అడ్డంగా ఇటూ అటూ తిప్పి చూసేను. ఈ పరీక్షని బొమ్మ కండ్ల ప్రతివర్తిత పరీక్ష అంటారు. బుర్రని కదిపినప్పుడల్లా మన అంతర్కర్ణాలలో ఉన్న సంతులన యంత్రాంగం ఆ కదలికని గ్రహించి, బుర్ర కదులుతునాది సుమా అన్న వార్తని మెదడుకి పంపుతుంది. వెంటనే ఆ కదలికకి విరుగుడుగా మెదడు మన కండ్ల గుడ్లని రెండో పక్కకి తిప్పుతుంది. చిన్న పిల్లలు ఆడుకునే బొమ్మల కండ్లు ఇలాగే తిరుగుతాయి. ఇది ఇలా జరగక పోతే మనకి తల తిరిగినట్లు అవుతుంది. కాని ఈ కార్యక్రమం జరగడానికి కావలసిన వాకేతాలన్నీ మన కూడలి కేంద్రం అయిన రెటిక్యులార్ ఏక్టి వేటింగ్ సిస్టమ్ గుండా వెళ్లాలి. ఈ కేంద్రం దెబ్బ తింటే

బొమ్మ కండ్ల ప్రతివర్తితలు ఉండవు. నేను భయపడ్డంత పనీ అయింది. చెంగమ్మ కండ్లలో ఏ కదలికా లేదు.

నా ముఖం కత్తి వేటుకి నెత్తురు చుక్క లేనట్టు పాలి పోయింది. నా ముఖ కళవళికలని గమనిస్తోన్న చెంగమ్మ పైనా కూతురు ఆత్రుతతో అడుగుతోంది.

"డాక్టర్ మా అమ్మకి పరవా లేదు కదా?"

ఇటువంటి పరిస్థితులలో వైద్యుడు రోగి బంధువులకి ఏమిటి చెప్పవచ్చు ఏమిటి దాచవచ్చు అన్న సమస్యని భారతదేశంలో ఒక లాగ అమెరికాలో మరొకలాగ ఎదుర్కొంటారు.

"మీ అమ్మ పరిస్థితి చాల విషమంగా ఉంది. ప్రాణానికి ....."

వాక్యాన్ని అర్ధాంతరంగా ఆపేసి నర్సుని ఎలుగెత్తి కేకేసేను.

"ఈవిడకి అర్జెంటుగా సీటీ స్కేన్ తీయించాలి. మేడమీదకి పంపు" అంటూ ఒక హుకుం జారీ చేసి, సీటీ స్కేన్ అంటే ఏమిటో చెంగమ్మ కూతురుకి చెప్పి కొంచెం ధైర్యం చెబుదామన్న ప్రయత్నంతో

"చూడమ్మా సీటీ స్కేను అంటే మరేమీ కాదు. అదొక రకం ఎక్సురే అనుకో. ఎక్సురే ఫొటో తీస్తే సాధారణంగా ఒకటో రెండో ఫొటోలు తీస్తారు. సీటీ స్కేను అంటే ఎక్సురే సినిమావే అనుకో. అంటే మీ అమ్మ మెదడుకి ఎక్సురే కిరణాల సహాయంతో బోలెడు ఫొటోలు తీస్తారు. కంప్యూటరు సహాయంతో ఈ ఫొటోలని చదువుతారు. అందుకనే ఈ పద్ధతిని కంప్యూటెడ్ టోమోగ్రఫీ అని గాని లేదా పొడి అక్షరాలతో ముద్దుగా సీటీ అని గాని అంటారు. ఈ రకంగా సినిమా తియ్యడాన్ని సీటీ స్కేను అంటారు. ఇందులోనే మరొక రకం పద్ధతిని కంప్యూటెడ్ ఏక్సియల్ టోమోగ్రఫీ లేదా 'కేట్ స్కేన్' అంటారు. ఈ పద్ధతిలో కంగారు పడవలసినది ఏమీ లేదు" అని ధైర్యం చెపుతూ, ఉండగా అప్పుడే ఎమర్జెన్సీ వార్డులోకి వచ్చిన మరొక కొత్త కేసు చూడడానికి రమ్మనమని పిలుపొచ్చింది.

వెల్లబుకి వస్తూన్న ఏడుపుని ఆపుకుంటూ ఉన్న చెంగమ్మ కూతురినే ఓదార్చనా, ఎమర్జెన్సీ వార్డులోకి కొత్తగా వచ్చిన పేషెంటునే చూసేదా?

కొత్తగా వచ్చిన పేషెంటుకి డెబ్బయి ఏండ్లు ఉంటాయేమో. బాత్‌రూంలో కాలు జారిందిట. నుదిటిమీద గాయం గట్టిగానే తగిలినట్లుంది. ముఖం అంతా రక్తసిక్తమయి ఉంది. తుంటి ఎముక విరిగిందంటే ప్రాణాపాయం కూడా. పెద్దాయన పరిస్థితి అదుపులోకి వచ్చే సరికి అరగంట పైగా పట్టింది.

మిగిలిన పని ఇంటర్న్‌కి (అమెరికాలో ఇంటర్న్ అంటే మన దేశంలో హవుస్ సర్జన్‌తో సమానం) అప్పగించి, సీటీ స్కేన్ తతంగం ఎంత వరకు వచ్చిందో కనుక్కుందామని మేడమీదనున్న మా ప్రయోగశాలలో పని చేసే సాంకేతిక నిపుణుడు రాబర్ట్‌కి ఫోన్ చేసేను.

"ఇంకా పని పూర్తి కాలేదు. కాని చూసిన బొమ్మలని బట్టి బ్రెయిన్ స్టెమ్ దగ్గర రక్తం చిమ్మినట్లు కనిపిస్తున్నాది. సారీ డాక్టర్. ఈ వేళ చెడ్డ వార్త చెప్ప వలసి వచ్చింది."

"తల్లి చచ్చిపోతున్నాదని కూతురికి చెప్పడం ఎలా? ఆ అమ్మాయికా ఇంగ్లీషు పూర్తిగా అర్థం అవడం లేదు. ఎందుకేనా మంచిది. ఆ సీటీ స్కేన్ బొమ్మలేవో నేనే స్వయంగా చూద్దామని ఎలివేటర్ దగ్గరకి వెళ్లి గోడమీద మీట నొక్కి నిరీక్షిస్తున్నాను. ఎలివేటరు వచ్చింది. నేనూ లోపలికి వెళ్లబోతూ ఉంటే మా విమలమ్మ బయటకి వస్తూ కనబడింది.

"డాక్టర్ రావ్. మిసెస్ చెంగ్‌కి సీటీ స్కేన్ అయిపోయింది. వరండాలోనే వెయిట్ చేస్తున్నాది. డాక్టర్ రావ్. విశేషం ఏమిటి తెలుసా? మిసెస్ చెంగ్‌కి పూర్తిగా మెలుకువ వచ్చేసింది. తల్లి, కూతురు చిలకల్లా మాట్లాడుకుంటున్నారు."

"అసంభవం. చెంగమ్మకి బొమ్మ కండ్లు లేవు. రాబర్ట్‌కి సీటీ స్కేన్ ఫొటోలలో రక్తం కనిపించింది. ఈ పేషెంటుకి మెలుకువ రావడమా? అసంభవం"

"డాక్టర్ రావ్. మీ వైద్య సిద్ధాంతాన్ని నమ్మమంటారా? నా కండ్లని నమ్మమంటారా? మీరే చూడండి" అంటూ చెంగమ్మ పడుక్కున్న పరుపు వేపు చూపించింది.

నా కండ్లని నేనే నమ్మలేక పోయాను. బొమ్మ కండ్ల ప్రతివర్తితలు ఎందుకు కనిపించ లేదు? బ్రెయిన్ స్టెమ్‌లో రక్తపు డాగులు రాబర్ట్‌కి ఎందుకు కనిపించేయి. ఇద్దరమూ పొరపాటు పడ్డామా? ఎవరు ఎక్కడ ఎప్పుడు పప్పులో కాలేసేరా అని పరిపరి విధాల పరుగెడుతూన్న నా మనస్సులోని ఆలోచనా తరంగాలకి అంతరాయం కలిగిస్తూ,

"హార్ట్ ఎటాక్" అంటూ ఒక మధ్య వయస్కుడిని లోపలకి తోసుకొచ్చారు నర్సులు. కదలండి, కదలండి అంటూ పెద్ద నర్సు అందరినీ అదమాయిస్తోంది.

యాంత్రికంగా అంతా హృద్రోగపు ఆసామీ చుట్టూ మూగేం. మనిషికి నలభై ఉంటాయి. శీతల స్వేదంతో ముఖం అంతా చెమ్మగా ఉంది. గబగబా ఇకేజీ తీసి చూసేం. ఇది కచ్చితంగా హార్ట్ ఎటాకే. సందేహం లేదు.

"హార్ట్ ఎటాక్" రావడానికి "స్ట్రోక్" రావడానికి ఉండే కారణాలలో కొంచెం పోలిక లేకపోలేదు. గుండెకాయకి రక్తం మోసుకెళ్లే నాళంలో కదుం కట్టిన రక్తపుగడ్డ అడ్డు పడితే "హార్ట్ ఎటాక్" వస్తుంది. కనుక "హార్ట్ ఎటాక్" అంటే గుండెకి రక్తపు సరఫరా ఆగి పోవడం. మెదడుకి వెళ్లే నాళంలో అడ్డంకి వచ్చి మెదడుకి రక్తపు సరఫరా ఆగి పోతే "బ్రెయిన్ ఎటాక్" అనాలి. కాని "స్ట్రోక్" అంటారు. "హార్ట్ ఎటాక్" ని తెలుగులో గుండె పోటు అంటే, "స్ట్రోక్" ని మెదడు పోటు అనాలి.

కనుక మెదడు పోటు వచ్చిన వారికి ముందుగా చెయ్యవలసిన ప్రథమ చికిత్స ఏమిటంటే కరడు కట్టిన రక్తపు కదుం కరిగేటట్టు చూడడం. దీనికి ప్రత్యేకం మందులు ఉన్నాయి. ఆ మందులని "ఐవీ" ద్వారా ఎక్కించడానికి కావలసిన ఏర్పాట్లు అన్నీ చేయిస్తూ ఉండగా డాక్టర్ రంగనాథన్

డ్యూటీ లోకి రావడం గమనించి, ఈ గుండె పోటు రోగిని అతనికి అప్పగించి, నేను మళ్లా మన చైనా దేశపు చెంగమ్మ "సీటీ స్కేను" బొమ్మలు స్వయంగా చూద్దామని రేడియాలజీ విభాగానికి పరుగెత్తుకుంటూ వెళ్లేను.

ఎక్సురే బొమ్మలని, సీటీ స్కేను బొమ్మలని పరీక్షించే నిపుణుడిని "రేడియాలజిస్టు" అంటారు. చెంగమ్మ సీటీ స్కేను బొమ్మలని రేడియాలజిస్టుకి ఇచ్చి అతని అభిప్రాయం అడిగేను.

ఇలాంటి బొమ్మలని చూడడానికి ఒక గాజు పలక, దాని వెనకాతల దీపం ఉన్న ఏర్పాటు ఉంటుంది. దాంట్లో సీటీ స్కేను బొమ్మలని అమర్చి చూసీ చూడగానే,

"ఇది 'సెరిబెల్లార్ హెమరేజి' అనుమానం లేదు. రక్తస్రావం రెండు మూడు సెంటీమీటర్ల మేర వ్యాపించి పోయింది." అన్నాడు.

"సెరిబెల్లారా, డామిట్ కొంప ములిగిందయ్యా" అని ఒక్క సారి కేక వేసినట్లు అరిచి ఒక్క ఉదుటున పెద్ద పెద్ద అంగల వేస్తూ పరుగు లంకించుకున్నాను.

'హెమరేజి' అంటే రక్తస్రావం అని చెప్పేను కదా. ఈ రక్తం ఎక్కడ స్రవించిందో చెప్పడానికి 'హెమరేజి' అన్న మాట కి ముందు ఒక విశేషణం వాడతారు. సెరిబెల్లార్ హెమరేజి అంటే చిన్న మెదడులో రక్త స్రావం. అలా స్రవించిన రక్తం గడ్డకట్టి కదుం లా తయారయినా, వాచినా దాన్ని హెమటోమా అంటారు. మెదడుకీ, మెదడు చుట్టూ ఉండే 'డూరా' అని పిలవబడే పొరకీ మధ్య రక్తం స్రవించి వాచితే అది 'సబ్‌డూరల్ హెమటోమా'. మెదడు లోపల ఎక్కడో వాచితే అది 'ఇంట్రా సెరిబ్రల్ హెమటోమా'. అలాగుంటాయి ఈ పేర్లన్నీ.

రక్త స్రావం కాని, కదుం కట్టడం కాని ఎల్లప్పుడు ప్రాణాంతకమయిన ప్రమాదం కాదు. మేథాకాండం లోపల రక్తస్రావం జరిగితే అది యమధర్మ రాజు పాశం. చిన్న మెదడులో రక్తస్రావం జరిగితే అది సత్యవంతుడి తరఫున సావిత్రి వేసిన హస్తం. మిగతా స్ట్రోకులు ఏవీ అంత సులభంగా లొంగవు కానీ, చిన్న మెదడులో రక్తస్రావం జరగడం వల్ల వచ్చిన స్ట్రోకుని మాత్రం శస్త్రచికిత్స చేసి కుదర్చవచ్చు. కాని ఆ కాగల కార్యాన్ని తొందరగా తెమల్చాలి. నిమిషాల మీద శస్త్ర వైద్యం చేసి చిన్న మెదడులోకి స్రవించి కరడు కడుతూన్న రక్తపు ముద్దని అతి త్వరగా తీసెయ్యక పోతే ఆ కరడు మేథాకాండం మీద ఒత్తిడి పెట్టడం మొదలు పెడుతుంది. దానితో ఊపిరి ఆగి పోతుంది. అదీ నా గాభరాకి కారణం. అదే నా పరుగుకి కారణం. ఇప్పటికే కాలహరణం అయి పోయింది.

నా కాలి కంటే బుర్ర ఇంకా జోరుగా పనిచేస్తోంది. ఇప్పటికి పరిస్థితి నిజ స్వరూపం అరటి పండు ఒలిచి పెట్టినట్లు అర్థం అయింది. చెంగమ్మ గారి చిన్న మెదడులో రక్తస్రావం జరిగింది. దాని వల్ల ఆ దగ్గరలోనే ఉన్న మేథాకాండం, ఆ కాండం మీద ఉన్న రెటిక్యులార్ ఏక్టివేటింగ్ సిస్టమ్ గట్టిగా దెబ్బ తినలేదు కాని కొద్దిగా అదిరి పడింది. దాని వల్ల పేషెంటు తాత్కాలికంగా కోమా లోకి వెళ్లిపోయింది. కొద్ది క్షణాలపాటు బొమ్మ కండ్ల ప్రతివర్తితలు ఆగి పోయాయి. ప్రయోగశాలలో రాబర్ట్ చూసినది మేథాకాండం మీదకి చిమ్మబడ్డ రక్తపు డాగులు మాత్రమే. మేథాకాండం లోపల నుండి బయటకు స్రవించిన రక్తం కాదు. ఈ విషయం అర్థం కాక గంట సేపు కాలయాపన జరిగి పోయింది. ఆలస్యం అమృతం విషం అన్న నానుడి ఇక్కడ అక్షరాలా వర్తిస్తుంది.

యంత్రంలా ఆలోచిస్తూన్న నా మెదడులో ఒక్క సారి ఒక ఆలోచన మెరిసింది. మా ఆసుపత్రిలో బ్రెయిన్ సర్జరీకి కావలసిన సదుపాయాలు లేవు. కనుక పేషెంటునీ, పేషెంటు రికార్డుని అతి త్వరగా పెద్దాసుపత్రికి బదిలీ చెయ్యాలి. అందుకని రాబర్ట్ పని చేస్తూన్న లేబు దగ్గర కాలికి మరకట్టు వేసి

"రాబర్ట్, ఆ చెంగమ్మ జబ్బేమిటో అర్థం అయింది. అది సెరిబెల్లార్ హెమరేజి. అర్జంటుగా ఆపరేషన్ చేస్తే కుదిరే రోగం. కనుక ఆ సీటీ స్కేను బొమ్మలని పెద్దాసుపత్రికి ఫేక్సు చెయ్యి" అని నేనరవడం, "అలాగే" అని రాబర్ట్ చెప్పడం మాత్రం నాకు లీలగా గుర్తు ఉందంతే. మరుచటి క్షణంలో చెంగమ్మ పక్క పక్కకి చేరేను. చెంగమ్మ పరిస్థితి ఏమీ బాగు లేదు. పది నిమిషాలు కూతురితో మాట్లాడిందో లేదో మళ్లా మగత కమ్మేసిందిట. ఇలా మెలుకువ వస్తున్నాది. ఇలా మగత కమ్మేస్తున్నాది. నేను వెంటనే పెద్దాసుపత్రిలో నూరో సర్జన్‌కి ఫోను చేసేను. కథనం అంతా చెప్పేను.

"సీటీ స్కేనులు పంపుతున్నానన్నారు కదా. అవి రానివ్వండి, చూద్దాం"

ఈ లోగా చెంగమ్మ కూతురికి విషయం అంతా బోధపరచడానికి వెళ్లేను. ముందు ప్రాణాపాయం అన్నాను. నా మాట నా నోట్లో ఉండగానే చెంగమ్మ చిలకలా కూతురితో కబుర్లు చెప్పింది. ఇప్పుడు, సర్జరీకి మరో ఆసుపత్రికి బదిలీ చెయ్యాలంటే గొల్లపిల్లవాడు, తోడేలు కథలా అవదూ? ఎలాగో ధైర్యం తెచ్చుకొని చెంగమ్మ కూతురికి అంతా పూస గుచ్చినట్లు చెప్పి, కొంచెం ఓపిక పడితే అన్నీ సర్దుకుంటాయని ధైర్యం చెప్పి, సీటీ స్కేనులు ఫేక్సయాయో లేదో చూద్దామని రాబర్ట్ ఆఫీసు వేపు వెళ్లి,

"రాబర్ట్, ఆ సీటీ స్కేను బొమ్మలని పెద్దాసుపత్రికి ఫేక్సు చేసేవా?" అని అడిగేను.

"ఇంకా లేదండి. ఈ వేళ ఫేక్సు మెషీను చాల బిజీగా ఉందండి."

"ఆ బొమ్మలు తక్షణం వెళ్లాలోయ్"

"ఉత్తర క్షణంలో వెళ్లాలంటారా?"

"ఉత్తరం లేదు, దక్షిణా లేదు. పంపవయ్యా మగడా. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది."

మరో పది నిమిషాలు పోయిన తర్వాత నూరో సర్జన్‌కి మరోసారి ఫోను చేసేను, సీటీ స్కేను బొమ్మలు అందేయో లేదో కనుక్కుందామని. అందేయిట. చూసిన తర్వాత ఫోను చేస్తానని అన్నాడు. ఏదో పెద్ద గుర్రం పళ్లు తోముతూ ఉండి ఉంటాడు. మహానుభావా ఇక్కడ మా ప్రాణాలు పోతున్నాయి, కొంచెం తెమల్చవయ్యా అని మరోసారి బతిమాలి, చెయ్యగలిగేది ఇంకేమీ లేక కాలు కాలిన పిల్లిలా రెండు నిమిషాలు ఇటూ

అటూ తిరిగి, అంబులెన్సు సిబ్బందిని తయారుగా ఉండమని హెచ్చరించి, మళ్లీ టెలిఫోను మోగుతుందేమోనని ఫోను పక్కనే కూర్చున్నాను. చెంగమ్మ మగతలోకి వెళ్లిపోతోంది. టెలిఫోను ఎప్పటికీ మోగక పోయేసరికి ఇంక ఉండబట్టలేక నేనే మూడో సారి నూరో సర్జన్‌కి ఫోను చేసేను.

"క్షమించాలి. మిమ్మల్ని వేధించుకుని తినక తప్పడం లేదు. నా పేషెంటు జారి పోతోందేమో నని అనుమానంగా ఉంది......"

"పంపండి, చూస్తాం"

అని ముక్తసరిగా రెండు మాటలు మాట్లాడి ఫోను పెట్టేసేడు సర్జను. ఏం మరో రెండు మాటలు మాట్లేడితే ఏమయినా అరిగి పోతాడా. ఫోను పెట్టేసిన తర్వాత కోపంగా "థేంక్సు" అన్నాను.

నిమిషాల మీద చెంగమ్మని పెద్ద ఆసుపత్రికి బదిలీచేసేము.

వైద్యవృత్తిలో ఉన్న మేము పేషెంట్ల ఎడల అభిమానం, ఆప్యాయత పెంచుకో కూడదు. తామరాకు మీద నీటిబొట్టులా ఉండాలి. నిజమే. కాని మొదట్లో నా వల్ల జరిగిన ఆలస్యానికి ప్రాయశ్చిత్తం ఏదీ. ఆ చెంగ్ చైనా దేశీయురాలు, నేను భారతీయుణ్ణి. ఏదో కాకతాళీయంగా ఈ అమెరికాలో, ఈ ఆసుపత్రిలో కలుసుకోవడం తటస్థించింది. ఆమె ఎలా పోతే నాకెందుకు. మరో కేసు, మరో పేషెంటు అని నేను ఊరుకోవాలి గాని, ఈ ఆరాటం ఏమిటి? నేనిలా తర్జనభర్జనలు పడుతూ ఉంటే.

"తుపాకి దెబ్బ. ట్రామా, ట్రామా"

అని నర్సులు పరుగులు తీస్తూ ఉంటే నా జీవితపు నాటకంలో మరో అంకం మొదలయింది.

కాని చెంగమ్మ నా మనస్సును వీడ పోలేదు. వారం గిర్రున తిరిగి పోయింది. మరో కేసు. మరో సందర్భం. అదే నూరో సర్జన్‌తో మాట్లాడవలసిన పనొచ్చింది. ఉండబట్ట లేక అడిగేను.

"వారం రోజుల క్రితం పంపిన మిసెస్ చెంగ్ కేసు ఏమయింది"

అటు నుండి సమాధానం రాలేదు. నా గుండె ఝల్లు మంది.

"అదే, ఆ సెరిబెల్లార్ బ్లీడింగ్‌తో ...." దుర్వార్త ఎక్కడ విన వలసి వస్తుందో అని మనస్సు పీకుతున్నా అడగకుండా ఉండలేక అడిగేను.

"ఓ, ఆవిడా. నిక్షేపంలా ఉంది. మీరు రోగ నిర్ణయం అంత బాగా చేసి పంపబట్టి, ఆవిడ బతికింది. కొంచెం కాళ్లీడుస్తూ నడుస్తున్నాది. అది కూడ తగ్గి మామూలు మనిషవుతుంది"

"నా నాయనే" అని నాలో నేనే ఆ నూరో సర్జన్‌ని మెచ్చుకుంటున్నానో లేదో, డాక్టర్ రావ్, ఎమర్జెన్సీ అన్న పిలుపుతో ఈ లోకంలో వచ్చి పడ్డాను.

(టోనీ డేహెర్ రాసిన కథ 'ది టిక్ అఫ్ టైమ్' ఆధారంగా)

---


## HEART AND HAND FOR THE HANDICAPPED

P.O.BOX 520230, FLUSHING, N.Y. 11352

### *25 Years of Dedicated Service to Less-Able Children*

Started by 5 dedicated Indian housewives in 1971, Heart and Hand for the Handicapped (HHH) has served thousands of disabled children all over in India and in U.S.A. in past 24 years.

**Some Institution in A.P. funded by HHH:**

Vegesna Padmavathi School - Hyderabad.
Smt. Merla Ramamma Memorial School - Gannavaram.
Eye & Polio Hospital - Vuyyuru.
Eye Foundation of America - Kothuru, Kakinada.
Sweekar, Secunderabad.

**Special Medical Projects Conducted by HHH:**

VISION SCREENING AND TREATMENT PROGRAM - 20,000 children
PROJECT POLIO SURGERY - 550 children
Details of individual projects and institutions will be highlighted in future issues.

**THANK YOU ...for LENDING A HAND.**

Come join us for our **Silver Jubilee Celebration!**

Become a Patron/Donor/Sponsor.

For information, please call:
Dama Venkaiah (718)762-7173 Ganga Mukkavilli (212)684-2727 Sobha Podila (718)591-6577

The above public service message was sponsored by Sri Dama Venkaiah.